## క్లుప్తంగా

### బోగాదమ్మకు పూజలు

**కమలాపురం :** మండలంలోని పందిళ్లపల్లెలో నూతనంగా ప్రతిష్ట గావింపబడిన బోగాదమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు సాయినాథశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన ఆలయానికి విచ్చేశారు. బోగాదమ్మ, పోతురాజుస్వామి వార్లకు పూజలు నిర్వహించి ప్రతిష్ట మండల పూజ హోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతిష్ట ఆచార్యులు వెంకటేశ్వరశర్మ వేదమంత్ర ఆశీర్వచనం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు సాయినాథశర్మకు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### నాంచారమ్మతల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో నాంచారమ్మతల్లి

**తొండూరు :** మండలంలోని ఇనగలూరు గ్రామంలో ఉన్న నాంచారమ్మ ఆశీస్సులతో గ్రామస్తులందరూ చల్లగా ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నారు. గురువారం గ్రామంతో అమ్మవారు ప్రజలకు చల్ల ఉండటంతో గ్రామస్తులందరూ కలిసి కట్టుగా అమ్మవారి ప్రసాదాలైన బెల్లం, మిగతా నైవేద్య ప్రసాదాలను పంపిణీ చేశారు.

### వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న కుటుంబ సభ్యులు

**లింగాల :** ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో గురువారం రిటైర్డు తహసీల్దార్ కుళ్లాయప్ప తన భార్య హుస్సేనమ్మ జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వెంకట్రామిరెడ్డి, టీచర్ వెంకటనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### పేద ముస్లింలకు రంజాన్ తోఫా


పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

**పులివెందుల టౌన్ :** పట్టణంలోని స్థానిక చెన్నారెడ్డి కాలనీ మసీద్ సమీపంలో నివాసముంటున్న పేద పేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ పండుగ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు శశికాంత్ రెడ్డి రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మాజీ డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్ కోడి రమణ, మైనార్టీ నాయకులు నూరుల్లా చేతుల పేలకు రంజాన్ తోఫా సరుకులను అందించారు.

### న్యాయవాదులకు శిక్షణ

**కడప అర్బన్:** జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ తమ సిబ్బందితో కలిసి కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయ సేవా సదన్‌లో నాలుగవ రోజు గురువారం కూడా ×మధ్యవర్తిత్వం×పై న్యాయవాదులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళ నుంచి వచ్చిన రీసోర్స్ పర్సన్‌లు పీజీ సురేష్, జి.జ్యోతి మాట్లాడుతూ ప్రతిస్తంభన దశలు, మధ్య వర్తుల ప్రతిబింబాలు, నిర్వహణ, వ్యూహాలు, అంచనా వ్యూహాలు, వాస్తవ పరీక్ష, ఎంపికల జనరేషన్ వ్యూహాలు, లెటరల్ థింకింగ్, మధ్యవర్తిత్వ ప్రక్రియను నిర్దేశించడం, సామాజిక నైపుణ్యాలు, స్వీయ నిర్ణయం, పరిష్కారం నమోదు చేయడం, ప్రచురణ, ప్రకటనలు చట్టపరమైన సలహా తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**కడప ఎడ్యుకేషన్:** కడపలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల (మైనార్టీ బాలుర)లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సోమ సత్యశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మైనార్టీ బాలురతోపాటు ఎస్సీ, ఎస్టీ బాలురు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 77801 79446, 90595 00173 సంప్రదించాలని తెలిపారు.

# బస్సు ఉచితం కచ్చితమేనా..?


పులివెందుల ఆర్టీసీ బస్టాండులో ఉన్న బస్సులు

**పులివెందుల రూరల్ :** అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసంచేసి అధికారంలోకి వచ్చాక హామీలతో తనకు సంబంధం లేదన్నట్టుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నారా చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలో కూడా సుమారు 600లకుపైగా హామీలు ఇచ్చి మోసం చేశారు. మళ్లీ 2024లో సూపర్ సిక్స్ పేరుతో హామీలు ఇచ్చారు. ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణమని చెప్పారు. అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నప్పటికీ ఉచిత బస్సు ప్రయాణం తుస్సుమనిపించారు. చంద్రబాబును నమ్మి మరోసారి మోసపోయామని మహిళలు వాపోతున్నారు. సార్వత్రిక ఎన్నికల హామీల్లో భాగంగా చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలపై పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునే విధంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆడబిడ్డ నిధి, దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి పథకాలను ప్రవేశపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 10 నెలలు పూర్తవుతున్నా హామీలను మాత్రం అమలు చేయడంలేదు. దీపం పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ప్రారంభించారని, అది కూడా కొంతమందికి మాత్రమే వారి అకౌంట్లలో జమవుతున్నాయని, చాలామందికి డబ్బులు జమ కావడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు చెప్పిన విధంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అన్నారు. కానీ ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదు. 2024 ఆగస్టు 15 ఈ పథకాన్ని అమలు చేస్తామని మంత్రులు చెప్పారు. మరి కొంతమంది మంత్రులు దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ తేదీలు మారుస్తున్నారే తప్ప ఈ పథకాన్ని అమలు చేయడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు, ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు అన్ని అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారే తప్ప ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదు. దీంతో మహిళలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోయామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడో**



కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. హామీ ఇచ్చి పది నెలలు పూర్తి అవుతున్నా ఇప్పటికీ ఉచిత బస్సు ప్రయాణం లేదు. చంద్రబాబు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి మహిళలను మోసం చేశాడు.

– సుకుమారి, పులివెందుల

**మహిళలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం**



2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం కోసం మహిళలకు అబద్ధపు హామీలు ఇచ్చారు. మహిళలకు బస్సులో ఎక్కడికి ప్రయాణం చేసిన ఉచితం అన్నారు. ఇప్పటికీ వాటిని అమలు చేయలేదు. చంద్రబాబు నాయుడుకు మహిళల ఉసురు తగులుతుంది. చేత కానప్పుడు హామీలు ఇవ్వకూడదు. .

– ధనలక్ష్మి, పులివెందుల

### జూదరుల అరెస్టు

**ముద్దనూరు :** మండలంలోని చిన్నదుద్యాల గ్రామ సమీపంలో పేకాట ఆడుతున్న 6 మంది జూదరులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.4,740ల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మైనుద్దీన్ తెలిపారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి

**ఎర్రగుంట్ల:** ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఐసీఎల్ ప్రహరీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు యర్రగుంట్ల ఎఎస్‌ఐ గురుశంకర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఐసీఎల్ ఫ్యాక్టరీ ప్రహరీ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైల్వే స్టేషన్‌లో భిక్షాటన చేస్తూ ఉండే వాడని స్థానికులు తెలిపారన్నారు. మృతుడి వయస్సు సుమారు 70 సంవత్సరాలు ఉంటుందన్నారు. స్థానిక వీఆర్‌ఓ రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

### ఘనంగా అంత్యక్రియలు

**వేంపల్లె :** గిడ్డంగివారిపల్లెలో వేంపల్లె జెడ్పీటీసీ సభ్యులు ఎం.రవికుమార్‌రెడ్డి తల్లి మాచిరెడ్డి లక్ష్మీ నరసమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు.

## నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

**పులివెందుల :** పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపీ సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రాని వారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కొలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజీల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## నేటి నుంచి కొండ గంగమ్మ తిరునాల


ప్రత్యేక అలంకరణలో ఉన్న కొండ గంగమ్మ అమ్మవారు

**పెండ్లిమర్రి :** నందిమండలం గ్రామ సమీపంలో వెలసిన కొండగంగమ్మ తిరునాల ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకుపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. శనివారం ప్రత్యేక కార్యక్రమాలు, కోలాటం, చెక్కభజన, ఆదివారం ఉదయం ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.1లక్ష, రెండు రూ.80వేలు, మూడు రూ.60వేలు, నాలుగు రూ.50వేలు, ఐదు రూ.40వేలు, ఆరు రూ.30వేలు, ఏడు రూ.20వేలు, ఎనిమిది రూ.10వేలు, తొమ్మిది రూ.5వేలు అందజేస్తామన్నారు.

## డిప్యూటీ డీఈఓ కార్యాలయం ప్రారంభించాలి

**లింగాల :** పులివెందులలో డిప్యూటీ డీఈఓ కార్యాలయాన్ని ప్రారంభించాలని మండలాల ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ డివిజన్ పరిధిలోకి పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు, వేముల, చక్రాయపేట, వేంపల్లె, వీరపునాయునిపల్లె మండలాలు వస్తాయి. ఈ మండలాల్లో పని చేస్తున్న హెడ్మాస్టర్లు అనేక రకాల సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు కూడా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు డిప్యూటీ డీఈవో కార్యాలయ పని కొరకు ప్రొద్దుటూరుకు వెళ్ళవలసి వస్తోంది. అక్కడికి వెళ్లిన తర్వాత అధికారులు, సిబ్బంది లేకపోతే మళ్లీ వెళ్లాల్సి వస్తోంది. దీంతో సమయం వృథా కావడమే కాకుండా డబ్బులు అధికంగా కూడా వెచ్చించాల్సి వస్తోంది. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అయినా కూడా అధికారులలో ఎలాంటి చలనం లేదని, వెంటనే పులివెందులలో డిప్యూటీ డీఈఓ కార్యాలయం ప్రారంభించి ఈ ప్రాంతంలో చేస్తున్న ఎంఈఓ, ఎఫ్ఏసీ, డిప్యూటీ డీఈఓగా బాధ్యతలను అప్పగించి కొంతమందిని ఆఫీస్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని మండలాల ఉపాధ్యాయులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి పులివెందులలో ఉప విద్యాధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోషకాహార లోపాలు గుర్తించాలి


అవగాహన కల్పిస్తున్న గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సునంద

**వల్లూరు (చెన్నూరు) :** బాలికలలో ఉన్న పోషకాహార లోపాలను గుర్తించి సరైన పోషకాహారాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి సునంద తెలిపారు. గురువారం చెన్నూరు సరస్వతినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలిక వికాసంపై అవగాహన కల్పించారు. కిషోర బాలికలకు బాల్య వివాహాలు, లైంగిక వేధింపులు, ఇతర నేరాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం శక్తి యాప్‌ను ప్రతి ఒక మహిళ తన మొబైల్లో డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

**కడప కార్పొరేషన్:** ఆప్కాస్‌లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని... ప్రభుత్వ ఉద్యోగులకు వర్తించే పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడం సాధ్యం కాదని, గ్రాట్యుటీ వర్తించదంటూ మునిసిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖ బుధవారం ఇచ్చిన ఉత్వర్వులను ఉప సంహరించుకోవాలని ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్, జిల్లా కోశాధికారి గోపి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్ అనే సంస్థ ప్రభుత్వ అధికారుల ఆధీనంలో నడుస్తున్న సంస్థ అని, ఔట్ సోర్సింగ్ ఏజన్సీల కోసం ఏర్పాటు చేసినట్లు సాంకేతిక కారణాలను సాకుగా చూపి చట్టబద్ధంగా అమలు కావలసిన గ్రాట్యుటీ పథకం అమలు నిరాకరించడం ప్రభుత్వ నిరంకుశ చర్యలకు నిదర్శనమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అయితేనే గ్రాట్యుటీ వర్తిస్తుందని చెప్పడంలో అర్థం లేదని, యజమాని.. కార్మికుడు అనే సంబంధం ఉన్న ప్రతి సంస్థలోనూ ఉద్యోగులు, కార్మికులు ఎవరికైనా గ్రాట్యూటీ వర్తిస్తుందన్నారు. ఆప్కాస్ ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులు కాదని ఇప్పుడు చెప్తున్న ప్రభుత్వం గత నాలుగేళ్లుగా 60 ఏళ్లు నిండిన వారిని ఉద్యోగులు అనే కారణంతో ఉద్యోగాల నుండి బలవంతంగా పదవీ విరమణ చేయించారని గుర్తు చేశారు. గతంలో సమ్మె సందర్భంగా ప్రభుత్వం రాతమూలకంగా ఇచ్చిన ఒప్పందం మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌తో కూడిన పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు.

### పేదలకు చీరల పంపిణీ

**వేంపల్లె :** స్థానిక వాసవీ నగర్‌లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక వాసవీ నగర్‌లో ఉన్న అబ్దుల్ రవూఫ్, ఆయేషాలు బిడ్డాలమిట్టలో ఉన్న పేదల మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రంజాన్ మాసం సందర్భంగా పేదలను ఆదుకునేందుకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు.

# ఉపసర్పంచ్‌ల ఎన్నికలు ఏకగ్రీవం


ఎర్రగుంట్ల : తుమ్మలపల్లి గ్రామ ఉప సర్పంచ్ తులశమ్మకు నియాకమ పత్రాన్ని అందిస్తున్న ఎంపిడీఓ


ఎర్రగుంట్ల : చిర్రాజులపల్లె గ్రామ ఉపసర్పంచ్ సుబ్బమ్మకు నియామక పత్రాన్ని అందిస్తున్న ఈఓపీఆర్డీ రహంతుల్లయ్య


కమలాపురం : కోగటం ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రవణమ్మకు ధృవీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి కెజియా

**ఎర్రగుంట్ల :** మండలంలోని తుమ్మలపల్లి, చిర్రాజుపల్లి గ్రామాలలో ఉపసర్పంచ్ ఎన్నికలలో వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఉపసర్పంచ్‌లను ఎన్నుకున్నారని ఎంపీడీఓ వెంకటరమణయ్య, ఈవోపీఆర్డీ రహంతుల్లయ్యలు తెలిపారు. గురువారం తమ్మలపల్లిలో ఎంపీడీఓ వెంకటరమణయ్య ఆధ్వర్యంలో, చిర్రాజుపల్లిలో ఈవోపీఆర్డీ రహంతుల్లయ్య ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. తుమ్మలపల్లెలో వార్డు సభ్యులు 7వ వార్డు సభ్యురాలైన గోర్ల తులశమ్మను ఉపసర్పంచ్‌గా ఎన్నుకున్నారు. అలాగే చిర్రాజుపల్లిలో వార్డు సభ్యులు 4వ వార్డు సభ్యురాలైన ఎదురలవల్లి సుబ్బమ్మను ఉపసర్పంచ్‌గా ఎన్నికై నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ రెండు గ్రామాలలో వైఎస్సార్‌సీపీ అధిక్యత ఉంది. పట్టణ సీఐ నరేష్ బాబు ఆధ్వర్యంలో ముద్దనూరు ఎస్‌ఐ మైనూద్దీన్‌లతో పాటు పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.


చింతకొమ్మదిన్నె : ధృవీకరణ పత్రాన్ని అందుకుంటున్న దొండపాటి వెంకటరమణారెడ్డి

**కమలాపురం..**

**కమలాపురం :** కోగటం గ్రామ ఉపసర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గురువారం కోగటం గ్రామ సచివాలయంలో ఎన్నికల అధికారి కెజియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఉప సర్పంచ్ ఎన్నికలో 8వ వార్డు మెంబర్, వైఎస్సార్ సీపీ మద్దతు దారురాలు కనపర్తి రవణమ్మను మిగిలిన వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 10వ వార్డు మెంబర్ నాగసుబ్బారెడ్డి రాజీనామా చేయడంతో ఈ ఎన్నిక అనివార్యమైంది. దీంతో ఉప ఎన్నికలో తాను ఉప సర్పంచ్‌గా ఉంటానని రవణమ్మ లేచి చెప్పడంతో మిగిలిన వార్డు మెంబర్లు అందరూ ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. దీంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం అయింది. కాగా కోగటం ఉప సర్పంచ్ వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది.

**చింతకొమ్మదిన్నె..**

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామ ఉపసర్పంచ్ పదవికి గురువారం గ్రామ సచివాలయంలో ఎన్నిక జరిగింది. వార్డు సభ్యులు దొండపాటి వెంకటరమణారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారిగా, మండల ఈవోపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**జమ్మలమడుగు రూరల్ :** బీసీ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ వారి సహకారంతో ఏర్పాటుచేసిన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఆయన ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సయ్యద్ ఉన్నీస, జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్ షా సాధిక్ పాష ఖాద్రీ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని పాతబస్టాండ్‌లో నూతనంగా నిర్మించిన సిఎస్‌ఐ రాయలసీమ డయాసీస్ దుకాణాల సమూదాయాన్ని ఆయన ప్రారంభించారు.

### నివాళి


గాజులపల్లె నాగిరెడ్డికి నివాళులర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజులరెడ్డిలు

**వల్లూరు (చెన్నూరు) :** చెన్నూరు మండలంలోని ఉప్పరపల్లె మాజీ సర్పంచ్ గాజులపల్లె నాగిరెడ్డి (80) మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ కమలాపురం ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డిలు మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. నాగిరెడ్డి ఉప్పరపల్లి గ్రామ సర్పంచిగా 25 సంవత్సరాలు సేవలందించి ప్రజల మన్ననలు పొందారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి గుమ్మ రాజేంద్రప్రసాద్‌రెడ్డి, ఉప్పరపల్లి ఎంపీటీసీ నిరంజన్‌రెడ్డి, నవనీశ్వర్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

### 1 నుంచి ఉచిత పాలిసెట్ కోచింగ్

**ప్రొద్దుటూరు కల్చరల్ :** జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పాలిసెట్–2025 ప్రవేశ పరీక్షకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్టు జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా గౌరవ సలహాదారుడు వై.గోపినాథ్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత తెలిపారు. స్థానిక జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో గురువారం పాలిసెట్ కోచింగ్‌కు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లో గల జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోచింగ్ అందిస్తామన్నారు. కోచింగ్ తీసుకోదలచిన వారు 9705333305 నంబర్‌కు ఫోన్ చేసి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదిక


నిఖీలు నిర్వహిస్తున్న పీడీ, డీవీఓ ఏపీడీ

**సింహాద్రిపురం :** స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో గురువారం 2024–25 ఆర్థిక సంవత్సర సామాజిక మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథక సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా గత 15 రోజుల నుండి మండలంలో జరిగిన వివిధ ఉపాధి హామీ పనులకు సామాజిక బృందం తనిఖీలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా రూ.15,50,34,793లు ఖర్చు చేయగా.. ఇందులో రికవరీ రూ.1,98,078లు చేయగా, జరిమానా రూ.74,000లు వేశారు. కార్యక్రమంలో పీడీ ఆదిశేషారెడ్డి, డీవీఓ రామలింగేశ్వరరెడ్డి, ఏపీడీ సోమశేఖర్‌రెడ్డి, తుంగభద్ర డీసీ చైర్మన్ జోగిరెడ్డి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ జయ భారతి, పీఆర్ ఏఈ ఉదయ్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ వాసుదేవరెడ్డి, ఉపాధి హామీ ఏసీ శ్రీనివాసరెడ్డి, ఉపాధి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ కార్యవర్గం ఎన్నిక


ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన కమిటీ కార్యవర్గం

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని ఏపీ కార్ల్‌లో గురువారం ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆప్కాస్ కార్మికులు ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ పులివెందుల డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా రామసుబ్బారెడ్డి, కార్యదర్శిగా శంకర్, సభ్యులుగా రామకృష్ణారెడ్డి, మణివర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, విశ్వనాథ్, గంగిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆప్కాస్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడం కోసం యూనియన్ కృషి చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసే ఆలోచనలో ఉందన్నారు. కార్మికులు ఎలాంటి భయాందోళనకు గురి కాకూడదని, ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు. ఆప్కాస్ కార్మికులందరూ ఐక్యంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. సంస్థలో పనిచేసే కార్మికులందరూ యూనియన్‌లో చేరి సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఐదు మందితో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. అధ్యక్షుడిగా విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా గంగిరెడ్డి, కమిటీ సభ్యులుగా హరి, శివయ్య, రవికుమార్, గంగాధర్‌రెడ్డిలను సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆప్కాస్ యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలపై చర్య తీసుకోవాలి


కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న నాగార్జునరెడ్డి

**పోరుమామిళ్ల :** తెలుగు రాష్ట్రాల్లో రోజు రోజుకు మోటార్ బైక్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, క్షణాల్లో నిండుప్రాణాలు గాల్లో కలసిపోతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు నాగార్జునరెడ్డి తెలిపారు. గురువారం కృష్ణ శారద డిగ్రీ కళాశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు.హెల్మెట్ ధరించక పోవడం, మద్యం సేవించి బైక్ నడపటం, అతివేగంగా పోవడం, ముగ్గురు, నలుగురు ఒక బైక్‌పై పోవడం, మైనర్లు బైకులు నడపటం ప్రమాదాలకు కారణమన్నారు.

రెండు రోజుల క్రితం లింగారెడ్డిపల్లె దగ్గర రెండు మోటార్ బైకులు ఢీకొని రాజారెడ్డి(40) చనిపోయాడన్నారు. అతను హెల్మెట్ ధరించి ఉంటే ప్రాణాలు కాపాడుకునేవాడన్నారు. ముద్దనూరు దగ్గర భార్యాభర్తలు బైక్ ప్రమాదంలో చనిపోతే పిల్లలు అనాథలయ్యారన్నారు. రాజంపేట దగ్గర రెండు బైకులు ఢీకొట్టుకుని ఇద్దరు చనిపోవడానికి కారణం ఇరువురికి హెల్మెట్లు లేకపోవడమేనన్నారు. ఎద్దడుగు కనుమ దగ్గర కాశినాయ మండలం చిన్నాయపల్లెకు చెందిన భార్యాభర్త, కూతురు బైక్‌పై పోతుండగా వెనుకనుండి టిప్పర్ ఢీకొట్టి ముగ్గురి ప్రాణాలు తీసిన ఘటన, అక్కడి రక్తపు మరకలు ఇంకా చెరిగిపోలేదన్నారు. పోరుమామిళ్ల పరిసర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి, పోగాకు ఉత్పత్తులతో మత్తులో వాహనాలు (టిప్పర్లు, లారీలు, బస్సులు) నడిపేవారిపై నిఘా పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. కర్ణాటకలో బైక్‌పై వెనుక కూర్చున్న వారికి కూడా హెల్మెట్ ఉండాలని, ఈ విషయంలో కర్ణాటక పోలీసులు ఖచ్చితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు.